# ఆవిడ



ఉదయం నుంచీ ఆవిడ ఒకటే హడావుడి చేస్తోంది. నా బట్టలన్నీ పెట్టెలో సర్దింది. ఒక కంచం, టిఫెన్ ప్లేటు, రెండు గ్లాసులు, రెండు చెమ్చాలు కూడా పెట్లో పెట్టింది.

నాలుగు దుప్పట్లు, తలగడ, ఒక పల్చటి పరుపు చుట్టగా చుట్టి జంబుఖానాలో గట్టిగా కట్టింది.

రవ్వలడ్డూలు ఒక డబ్బాలో, చక్కిలాలు ఒక డబ్బాలో పోసి ఒక బుట్టలో సర్దింది. ఒక హార్లిక్స్ సీసా... ఇలా ఏవేవో పెడుతోంది.

ఇదంతా నా మీద ప్రేమేనా?

ఏం కాదు... అంతా నాటకం!

పొద్దుట్నుంచీ నాకేవేవో ఉపన్యాసాలిస్తోంది.

ఇకనైనా బుద్ధిగా వుండాలట! అక్కడ పెద్దవాళ్ళు చెప్పిన మాట వినాలట! నా పనులన్నీ నేను చక్కగా చేసుకోవాలట, వస్తువులన్నీ జాగ్రత్తగా వుంచుకోవాలట! ఏవిటేమిటో తెగ వాగుతోంది.

నేను వెళ్తున్నానని తెగ బాధ నటిస్తోంది గానీ, ఈ వెళ్ళిపోవడం నాకెంత ఆనందంగా వుందో వీళ్ళకేం తెలుసు! వీళ్ళ గోల లేకుండా ఒక్కణ్ణీ సుఖంగా వుండొచ్చు.

అయినా ఈవిడ పురాణాలన్నీ వినేదెవరట!

మా అమ్మే వుంటే నేనిలా వెళ్ళాల్సొచ్చేదా. ఎంత మంచిది మా అమ్మ! నన్నెంత ముద్దు చేసేదో! ఒకప్పుడు "నాన్నా" అని పిలిచే ఆయనగారు మా అమ్మని రాక్షసుడిలా వేధించకపోతే మా అమ్మ అలా కాలిపోయేదా!

అమ్మ గుర్తొస్తే గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు అయిపోతుంది. కళ్ళల్లో నీళ్ళొచ్చేస్తాయి.

గలగల నవ్వుతూ, పాటలు పాడుకుంటూ తిరిగే మా అమ్మ... ఆయనగారి అరుపులకి ఎన్నిసార్లు చిన్న బుచ్చుకుందో! రాత్రిళ్ళు ఆయన కోసం ఎదురు చూస్తూ అమ్మ సోఫాలో కూర్చుంటే ఆవిడ ఒళ్ళో పడుకుని కబుర్లు చెప్పేవాడిని.

ఆ సమయంలో ఆయన మొహం చూడబుద్ధిగాక గేటు చప్పుడయ్యే వేళకి చటుక్కున కళ్ళు మూసుకునేవాడిని. అప్పుడు... నన్నక్కడే సోఫాలో వదిలేసి అమ్మని రూంలోకి లాక్కుపోయేవాడు.

ఆ తరువాత వినబడే మాటలు, అరుపులు, వెక్కిళ్ళు, మూలుగులు నన్నెక్కడో లోయలోకి తోసేస్తున్నట్టుండేవి. నన్నెవరూ రక్షించలేని పాతాళ మాంత్రికుడి గుహలో చిక్కుకున్నట్టుండేది. నా ప్రమేయం లేకుండా నిక్కరు, సోఫా రెండు తడిసి పోయేవి.

* * *

అంతలో ఆవిడ 'బాబీ'అని పిలిచింది. అమ్మ జ్ఞాపకాల్లోంచి బయటపడి వెళ్లి వంటింటి దగ్గర్నుంచున్నాను.

'చూడు బాబీ, నువ్వు వూరెళ్ళిపోతే ఇప్పట్లో రావడానికీ, మమ్మల్నెవర్నీ మాటిమాటికీ చూడ్డానికీ కుదరదు. ఏమన్నా మాట్లాడాలనుంటే చెప్పు. తమ్ముడితో కాసేపు కబుర్లు చెప్పుకురా'' అందావిడ.

పెద్ద గొప్పలు! నేనేదో వీళ్ళని చూడాలని చచ్చిపోతున్నట్టు!

ఆవిడ మాటని కాదనకుండా ఇంటిముందు తోటలో ఆడుకుంటున్న తమ్ముడి దగ్గరకి బయల్దేరాను.

హాల్లో ఆయనగారు డబ్బు లెక్కెట్టుకుంటూ, కాగితాలు సరిచూసుకుంటూ, అటు-ఇటు హడావుడిగా తిరుగుతూ పోజులు కొడుతున్నాడు. ఆయన్ని దాటుకుని ముందుకెళ్ళాను.

అంతలోపున తమ్ముడు గుమ్మంలోకి ఎదురొచ్చాడు. "అన్నయ్యా నన్నొదిలేసి వూరెళ్ళిపోతావా?" అన్నాడు బెంగగా. నాకూ వాడినొదిలి పోవాలంటే కొంచెం బాధగానే వుంది గాని, ఆవిడ, ఆయన,నేనేంచెప్తానో అని ఇటే చూస్తున్నారు. దాన్తో ఒళ్ళుమండి వాడికి రెండు తగల్నిచ్చి,

"అవును నేనొక్కణ్ణే హాయిగా వెళ్తాను. నువ్విక్కడే ఏడుస్తూ కూచో" అనేసి పారిపోయాను.

ఉట్టప్పుడయితే ఆయనెదురుగా ఈ పని చేస్తే నా భరతం పట్టేవాడే. వూరెళ్తున్నాను కదా అని వూరుకున్నట్టున్నాడు. తమ్ముడు ఏడ్చుకుంటూ మళ్ళీ తోటలోకి వెళ్ళిపోయాడు.

టైమయింది ఇంక బయల్దేరాలి అంటూ ఆయన రిక్షా తీసుకు రావడానికి వెళ్ళాడు.

ఇదే సమయమని తమ్ముడి కోసం తోటలోకి పరిగెత్తాను. చెట్టుకింద కూర్చుని వెక్కుతున్నాడు వాడు.

దగ్గరకెళ్ళి భుజంమీద చెయ్యేసాను. మాట్లాడకుండా నావేపు చూసాడు. అటు-ఇటు చూసి జేబులో వాడికోసం దాచిన చాక్లెట్లు తీసి వాడి ముందుకి జాపాను. ఏడుపు ఆపి కొంచెం ఆనందంగా చూశాడు. అయినా నామీద నమ్మకం లేనట్టు తీసుకుందుకు తటపటాయించాడు.

"తీసుకో, నీకే...'' అన్నాను మెల్లగా.

"అన్నయ్యా, అసలు.... నువ్వు వూరికెందుకు వెళ్తున్నావు?'' అనడిగాడు చాక్లెట్లు తీసుకుంటూ.

"నాకు చదువు సరిగ్గా రావడం లేదని, చెప్పిన మాట వినటంలేదని వైజాగ్‌లో అదేదో హాస్టలుందట. అక్కడ చేర్పిస్తారట. ఒరేయ్, నువ్వు చెప్పరా నేను అల్లరి చేస్తానా?'' అనడిగాను.

చాక్లెట్ల మహిమ కాబోలు, "ఊహుం నువ్వెప్పుడూ




అల్లరి చెయ్యవు. నాన్న చెడ్డవాడు. అందుకే నిన్ను వూరికి పంపేస్తున్నాడు."

ఆ మాట అబద్ధమని నాకు తెలుసు. నా చేతుల్లో వాడెన్ని చావు దెబ్బలు తిన్నాడో! అయినా నాకు ఆనందాన్నిచ్చే జవాబిచ్చినందుకు కానుకగా—

నా దగ్గరున్న సూపర్ మ్యాన్, హిమాన్ స్టిక్కర్లు, గోళీలు, బ్రూస్‌లీ ఫొటో, భూతద్దం అన్నీ వాడికిచ్చేసాను.

"నేను వూరి నుంచి వచ్చేదాకా ఇంకెవరి జట్టూ వుండటానికి వీల్లేదు" అని వాడికి గట్టిగా చెప్పి ఇంట్లోకి వెళ్ళాను.

అమ్మపోయాక నాది అనేది నాకేదీ మిగల్లేదు. అలా వున్నవాడు తమ్ముడొక్కడే. వాడింకెవరి జట్టున్నా నాకు నచ్చదు. అక్కడికీ ఆవిడగారు వాణ్ణి తెగ గారం చెయ్యడం... వాడు 'అమ్మా' అని ఆవిడని పిలవడం నాకు ఒళ్ళుమండిపోతూ వుంటుంది. వాణ్ణి నేను అప్పుడప్పుడు తన్నడానికీ అదే కారణం. అమ్మట! అమ్మ! చిన్న పిల్లాణ్ణి మాయచేసి అమ్మ అని పిలిపించుకుంటోంది. నేను మాత్రం చచ్చినా 'అమ్మ' అనను అసలు 'అది', 'ఇది' అని అంటుంటే ఆయన తన్నాడని 'ఆవిడ' అంటున్నాను గాని, లేకపోతే 'అమ్మ' అనో 'పిన్ని' అనో పిలవమని పెద్ద 'హుకుం' చలాయింపు. అమ్మని చంపేసి, మరొకావిణ్ణి తెచ్చి అమ్మ అనమంటాడా! బుద్ధుందా ఆ మనిషికి!

మూస్ తొడుక్కుంటుంటే ఆయన అరుపు వినపడింది. "బాబీ! రిక్షా వచ్చేసింది. త్వరగా రా" అంటూ కావాలని ఇంకాస్త నిదానంగా మూస్ వేసుకుని మెల్లగా తల దువ్వుకోసాగాను.

అంతలో ఆవిడ గది గుమ్మంలోకి వచ్చింది. "బాబీ! నీ మనసులో వున్న ఆలోచనల్ని మార్చుకో. ద్వేషాన్ని తగ్గించుకుని మంచి పిల్లాడిలా తిరిగిరా. "అంటూ చేతిలో చాక్లెట్ బార్ ఒకటి పెట్టింది. జేబులో ఇరవై రూపాయల నోటొకటుంచి "అవసరానికి వాడుకో నిన్ను పంపడం నాకిష్టంలేదు. కాని కొన్నాళ్ళు దూరంగా వుంటే నీకే అన్నీ అర్థమవుతాయని నా ఆశ. క్షేమంగా వెళ్ళిరా బాబీ" అంటూంటే ఆవిడ కళ్ళల్లో నీళ్లు.

ఇలాటి నాటకాల్ని నమ్మకూడదని గట్టిగా అనుకోబట్టి గాని... లేకపోతే నా మనసు కరిగిపోతోంది. నాకూ ఏడుపు వచ్చేస్తోంది. ఆవిడంటే కోపం పోతోంది. అందుకే మౌనంగా తలూపి అక్కణ్ణుంచి బయటకి పరిగెత్తాను.

అప్పటికే రిక్షాలో సామాను పెట్టి ఎదురుచూస్తూ నుంచున్నాడాయన. తమ్ముడి దగ్గర నుంచుని వాడికి టాటా చెప్పాను. అంతలో ఆవిడ గుమ్మంలోకి వచ్చి నుంచుంది. 'అమ్మ'లా దగ్గరకెళ్ళి గుసగుసగా 'వెళొస్తా పిన్నీ' అన్నాను.

ఆవిడ కళ్ళల్లో మెరుపు చూసి ఆనందంగానే అనిపించింది.

* * *

విజయవాడలో రైలు బయల్దేరిన కాసేపటికల్లా ఆయన సీటు కానుకుని కళ్ళు మూసుకున్నాడు. ఒరేయ్ అటు-యిటు పోకుండా జాగ్రత్తగా కూర్చో అని నన్ను హెచ్చరించాడు. నేను బయటకి చూస్తూ కూర్చున్నాను.

కిటికీలోంచి బయటికి చూస్తే నాక్కనిపిస్తున్నది చెట్లు, పొలాలూ కాదు. పొలాల కవతల ఏమి కాలుతోందేమరి, అవేవో మంటలు. మంటల్ని చూస్తే అమ్మే గుర్తొస్తుంది నాకు.

అమ్మ ఉంటే నేనసలు ఇలా వుండేవాడినా. రాజాలా దర్జాగా వుండేవాడిని. బాగా చదువుకుంటూ ఫస్టొచ్చేవాడిని. అసలు అమ్మ ఎందుకలా చేసిందో. నన్నొదిలి అలా ఎలా చెయ్య బుద్ధయిందో!

ఆ రోజు... అమ్మ, నాన్న ఎందుకంత దెబ్బలాడుకున్నారో నాకర్థం కాలేదు. చాలా సేపే గొడవ పడ్డారు. అమ్మ ఏడ్చింది కూడా.

రెండు రోజుల తరువాత...

అర్ధరాత్రి అరుపులు, గోల వినిపించి లేచి చూస్తే ఇంటినిండా జనం. గొడవ గొడవగా వుంది. వంటింట్లో అమ్మ మంటల మధ్య భయంకరంగా పడి దొర్లుతూ వుంది. కిరసనాయిలు కంపు. నాన్న మిగతా వాళ్ళు కంగారుగా వున్నారు. ఎవరో ఇద్దరు మంటలార్పుతున్నారు. ఎంత భయం వేసిందో అప్పుడు.

అంతలో పక్కింటి ఆంటీ నన్ను చూసి గబుక్కున బయటకి లాక్కుపోయింది.

"ఆంటీ అమ్మకేమయింది?" అనడిగాను. జవాబుగా ఆంటీ ఏడ్చింది అంతే.

పెద్ద తెల్లటి కారొచ్చి అమ్మని తీసుకుపోయింది. మళ్ళీ అమ్మ ఇంటికి రాలేదు. మర్నాడు ఆంటీ నన్ను పట్టుకుని మళ్ళీ ఏడ్చింది. ఉయ్యాల్లో తమ్ముణ్ణి ఎవరెవరో ఎత్తుకుని పాలు పట్టించారు. నేను మాత్రం అసలు ఏడవలేదు. అమ్మేమయిందో నాకు అర్థంకాలేదు.

అమ్మమ్మ, తాతయ్య, మావయ్య వచ్చారు. నాన్నని తిట్టిపోసారు. నాన్న ఒక్కమాట కూడా మాట్లాడకుండా విగ్రహంలా కూర్చున్నాడు. ఒక్కపూట కూడా అక్కడుండకుండా నన్ను తమ్ముణ్ణి రాజమండ్రి తీసికెళ్ళిపోయారు వాళ్ళు.

అమ్మమ్మ, తాతయ్య మమ్మల్నిద్దర్నీ ఎంతో ప్రేమగా చూసుకునే వాళ్ళు. కావల్సినవన్నీ కొనిపెట్టేవారు. మావయ్య ప్రతి వారం వూర్నుంచొచ్చి సినిమాలకి తీసికెళ్ళేవాడు. విజయ పిన్ని నెలకోసారి హైదరాబాదు నుంచి చూడ్డానికొచ్చేది, వచ్చినప్పుడల్లా నాకేవేవో

బొమ్మలు, బట్టలు కొని తెచ్చేది.

అమ్మమ్మ ఎక్కువగా తమ్ముణ్ణెత్తుకునే వుండేది. పాలు తాగే పిల్లాడు, తల్లిలేని పిల్లాడంటూ ముద్దు చేసేది. నన్ను తొందరగా స్కూల్లో వేస్తే మంచిదని స్కూల్లోకి పంపేసారు. ఆ టీచరు, స్కూలు నాకు నచ్చలేదు. తమ్ముడేమో హాయిగా ఇంట్లో అమ్మమ్మ చంకనెక్కి కూర్చుంటే నాకేమిటో ఈ బాధలు అనిపించేది.

అమ్మమ్మకెప్పుడూ పనే. ఎంత పన్లో వున్నా తమ్ముడేడిస్తే చటుక్కున వచ్చి చంకలో వేసుకునేది. నేను అమ్మమ్మ నా దగ్గర కెప్పుడొస్తుందా అని ఎదురు చూస్తూ కూర్చునేవాడిని. రాత్రెప్పుడో తమ్ముణ్ణి నిద్రబుచ్చి అప్పుడు నా పక్కకొచ్చి పడుకునేది. అప్పుడెంత ఆనందంగా వుండేదో.

ఒక రోజు... ఆ రోజు నా పుట్టిన రోజు. తమ్ముడేదో ఏడొచ్చిందని చెప్పింది అమ్మమ్మ. మావయ్య, విజయపిన్ని కూడా వచ్చారు. తనకి కొత్త బట్టలు, బొమ్మలు తెచ్చారు.

.... అప్పుడొచ్చాడాయన. ఆయన్ని చూస్తే భయం వేసి అమ్మమ్మ కొంగు చాటున దాక్కున్నాను. తమ్ముడేమో ఆయనిచ్చిన బిస్కట్లు ప్యాకెట్ విప్పి అప్పుడే తినడం మొదలెట్టాడు.

ఆయన కాగితాలేవో తాతయ్యకి చూపించి పిల్లల్ని తీసికెళ్తానని చెప్తున్నాడు. అమ్మమ్మ, తాతయ్య ఏదో మాట్లాడితే గట్టిగా దెబ్బలాడేసాడు. ఆయన అరుపులకి విజయపిన్ని, మావయ్యకూడా ఆగలేకపోయారు.

సామానంతా సర్దించి ఆ సాయంత్రమే తనని, తమ్ముణ్ణి విజయవాడ తీసుకొచ్చేసాడాయన. తమ్ముడు నేను రానని ఎంత ఏడ్చినా లాభం లేకపోయింది. నేనొక్క మాటకూడా మాట్లాడలేదు.

విజయవాడలో ఆ ఇల్లూ కాదు, ఆ అమ్మాలేదు.ఆ ఇంట్లో 'ఆవిడ' వుంది. తమ్ముణ్ణి ప్రేమగా ఎత్తుకుంది. నా మీద చెయ్యి వేయబోయింది. నేను దూరంగా జరిగాను. ఆ దూరం అలాగే వుందిప్పటికీ.

ఆయన 'అమ్మా' అని పిలవమన్నాడు. వినలేదు నేను. 'పిన్నీ' అని పిలవమన్నాడు. ఊహుఁ... ఓ రోజు బాగా తన్నాడు. నేను ఏ మాత్రం లెక్క పెట్టలేదు. ఆవిడే వచ్చి విడిపించింది.

"పోన్లెండి అలవాటు పడ్డాక వాడే పిలుస్తాడు బలవంతం చెయ్యకండి" అంది.

అసలు పిలవాల్సిన అవసరం ఏముంది? అతి తక్కువగా మాట్లాడతానావిడతో. ఆ చెప్పేదేదో ఎదురుగా వెళ్ళి నుంచుని చెప్పేస్తే ఇంక ఏమనయినా పిల్చే పనేముంది?

* * *

ఇంతలోపల పక్కనున్న ఆయన గట్టిగా గురక పెడుతూ పెడుతూ తూలబోయాడు. చటుక్కున మెలకువవచ్చి "ఒరేయ్ ఎక్కడకీ పోక జాగ్రత్తగా కూచో" అని పై కెక్కి పడుకున్నాడు.

ఎదుటి సీట్లో కుర్రాడు, చెల్లెలు మొక్కజొన్నకంకి ఇవ్వటం లేదన్న కోపంతో ఆ పిల్లని బెంచి మీంచి కిందికి తోసేసాడు. ఆ పిల్లకి దెబ్బ తగిలి బొప్పి కట్టింది. దాన్తో వాళ్ళమ్మ వాడికి గట్టిగా తొడపాశం పెట్టేసి వీపు మీద దబదబ రెండు చరుపులు చరిచింది. వాడి రెండు కళ్ళల్లోనూ నీళ్ళు.

వాణ్ణలా బాదకపోతే వాడికీ ఓ కంకి కొనియ్యకూడదూ?

ఓ సారి పెరటి అరుగు మీద తమ్ముడు, నేను కూర్చుని వున్నాం. నా కోసం ఆవిడ ఒక కథల పుస్తకం కొనిచ్చింది. తిరిగి నేను తీసుకోబోతే ఇవ్వకుండా వెనక్కి లాక్కున్నాడు. పుస్తకం చిరిగిపోయింది.

తిక్కరేగి ఒక్కతోపు తోసాను వాడిని. కిందపడి నుదురు చిట్లింది. వాడి ఏడుపు విని వంటింట్లోంచి ఆవిడ గబగబ వచ్చింది. వాణ్ణెత్తుకుని నా జబ్బ బలంగా పట్టుకుని గుడ్లురిమి చూసింది. కొడుతుందేమో అనే అనుమానంతో ఆవిడ చేతిని గట్టిగా కొరికేసి విదిలించుకు పారిపోయాను.

రాత్రి ఆయనొచ్చాక నన్ను చంపి పారేస్తాడనే భయంతో పెందరాళే అన్నం తినేసాను. ఆవిడ చేతికి కట్టు. కొద్దిగా రక్తం చెమర్చింది. వడ్డిస్తున్న ఆ చేతిని చూసి కొద్దిగా జాలి, చాలా భయమూ వేసాయి. ఇంత చేసినా ఈవిడ నన్నెందుకు కొట్టలేదు? నాకర్థం కాలేదు.

అటుగేటు చప్పుడు వినగానే మంచమెక్కి దుప్పటి ముసుగెట్టి పడుకున్నాను.

ఆయన లోపలికొచ్చాడు. ఆయన అడిగేవి, ఆవిడ చెప్పేవి అన్నీ వినిపిస్తూనే వున్నాయి.

"ఆ చేతికి కట్టేమిటి? ఏమయింది?"

"చిన్నవాణ్ణెత్తుకుని పెరటి మెట్లు దిగుతుంటే కాలు జారి వాడితో సహా పడ్డాను. చేతికున్న గాజు పగిలి లోతుగా గుచ్చుకుంది. చంటాడికి దెబ్బ తగిలింది." చిన్న గొంతుతో ఒక్కసారే రెండు అబద్ధాలు చెప్పిందావిడ.

నన్ను చితక్కొట్టించేస్తుందనుకున్నాను. ఇలా చేసిందేవిటి?!

"వీడప్పుడే పడుకున్నాడేవిటి? చదువులేదా?" నా గది గుమ్మం ముందే మాటలు వినిపిస్తున్నాయి.

"ఏమో కొద్దిగా తలనొప్పి అన్నాడు. త్వరగా అన్నం పెట్టి మాత్రవేసి పడుకోమన్నాను" అందావిడ మెల్లగా.

ఈవిడెందుకిలా రక్షిస్తోందినన్ను!

"అసలు పెరట్లో నువ్వే పడ్డావో, వీడేమన్నా ఘనకార్యం చేసాడా నిజం చెప్పు." నిలదీసాడాయన.

"మీకన్నీ అనుమానమే. వాడేదో అల్లరివాడు నిజమేగాని, నన్నేమి చేస్తాడండీ" అందావిడ సున్నితంగా.

అప్పట్లో నాకేమీ గొప్పగా కనిపించలేదు కూడా.

అసలయినా నేనావిడని బాధ పెట్టాల్సినలాంటి తప్పు ఆవిడేమీ చెయ్యలేదు నిజానికి. అసలు తప్పంతా పైన గురక పెడుతున్న ఆ మనిషిదే.

మర్నాడు వూళ్ళోని ఆవిడ అక్కయ్య చూడ్డానికొచ్చింది. వాచిపోయిన ఆవిడ చేతిని చూసి, తమ్ముడి దెబ్బని చూసి ఏడ్చింది.

"నీకిదేం ఖర్మమే! నీ కడుపున పిల్లలు పుట్టే అవకాశమా లేదు. సొంత పిల్లల ఆగడం అయితే ఎలాగో భరించచ్చు. ఈ పిల్లాడి చేతిలో ఈ బాధలన్నీ పడుతున్నావా? హయ్యో! వాడసలు పిల్లాడేనా?" అని గోలపెట్టింది.

"అలా అనకు అక్కయ్యా! తల్లిని దారుణంగా పోగొట్టుకున్నాడు వాడు. సొంతపిల్లల్ని తన్నినా ఆ పిల్లలూ తప్పుగా అనుకోరు. మిగిలిన వాళ్ళూ తప్పు పట్టరు. నేనెంత ప్రేమగా చూసుకున్నా కొడితే వెంటనే 'సవతి తల్లి' అనే నింద వేస్తారు. అన్నీ తెలిసే, ఆలోచించుకునే నేనీ ఇంట్లో అడుగు పెట్టాను కదా" అందావిడ. ఆ రోజు ఆ మాటలు అర్థం నాకు అంతగా తెలియలేదుగాని...

ఇప్పుడాలోచిస్తే అనిపిస్తోంది...

ఆవిడనన్నెంత దయగా చూసింది! నేను వెళ్ళిపోతుంటే కంటనీరు పెట్టుకుంది. జేబులో ఆవిడిచ్చిన చాక్లెట్లు, ఇరవై రూపాయల నోటు ప్రేమగా స్పృశిస్తున్నాయి నా గుండెల్ని.

ఏదో స్టేషన్‌లో ఆగింది రైలు. అమ్మ మొహానికి పక్కనే ఆవిడ ముఖమూ అంతే దయగా, ప్రేమగా నా ముందు నిలిచినట్టవుతోంది.

పక్కకి తిరిగిచూస్తే మా రైలు పక్కనే మరో రైలుంది. 'విజయవాడ' అని రాసున్న చెక్క పలక కిటికీలోంచి పలుకరించింది. 'మళ్ళీ విజయవాడకి పిన్ని దగ్గరకెళ్ళిపోతే...' అనుకున్నాను. రెండు నిమిషాలు ఆలోచించాను. కావాలంటే ఆ పైన గురకపెట్టే ఆయన వైజాగ్ వెళ్తాడులే. నేను విజయవాడ వెళ్ళిపోతాను... రైలుదిగి ఆ రైలెక్కేసాను.

నేనెక్కిన రైలు కదిలింది.

నేనెక్కిన రైలు మళ్ళీ విజయవాడ వైపు పరిగెడుతుంటే నా మనసు ఆనందంతో తేలికపడింది. కళ్ళ ముందు ఆవిడ ముఖం నవ్వుతూ కనిపించింది.

[లోకజ్ఞానం - సమాధానాలు]

1. ఆస్ట్రేలియాకు చెందిన షెర్లీ డి లా హంటీ. 1948, '52, '56 లలో జరిగిన ఒలింపిక్ పోటీలలో 3 బంగారు, 1 వెండి, 3 కాంశ్య పతకాలు ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌లో గెలుపొందింది.
2. అలీస్ పొల్లాక్. 'పోట్రెయిట్ అఫ్ మై విక్టోరియన్ యూత్'
3. సెకండుకి 186,282,397 మైళ్ళు లేక గంటకు 670,616,692.2 మైళ్ళు— మార్చి 1888 లో.
4. 3,250,000 చదరపు మైళ్ళు.
5. లూయీ బ్రౌన్.
6. కెనడాకు చెందిన కాండీ అల్లెన్. పొడవు: 7 అడుగుల 7¼ అంగుళాలు.
7. అలెగ్జాండర్ ఎమ్. పొనియటాఫ్. 1856లో
8. ఇజ్రాయిల్, లిబ్యా, న్యూజీలాండ్, ఓమన్, యునైటెడ్ కింగ్‌డమ్.
9. విజిడిస్ ఫిన్ బొగా డొట్టిర్. ఐస్‌లాండ్ దేశానికి జూన్ 30, 1980 న అధ్యక్షురాలుగా ఆ దేశ ప్రజలచే ఎన్నుకోబడ్డారు.
10. యు. ఎస్. ఎస్. ఆర్. 1952 నుంచి 1980 వరకు ఎనిమిదిసార్లు పతకాలను సాధించింది.